విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

మంగళవారం 22 అక్టోబర్ 2024 8 పేజీలు

పోలీసు అమరవీరుల త్యాగం వెలకట్టలేనిది..

- మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి
- ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

దేశ రక్షణ కోసం పోలీసులు చేసే ప్రాణత్యాగం వెలకట్టలేనిదని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సోమవారం ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి భారతి, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్, 3వ అదనపు జడ్జి డి.రాములు, 7వ అదనపు జడ్జి రాజా వెంకటాద్రి, 8వ అదనపు జడ్జి డి.అమన్ రాజా, డీఎల్ఎస్ఏ జడ్జి శ్యామ్ బాబు, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, రాష్ట్ర 20 సూత్రాలు ప్రోగ్రాం చైర్మన్ లంకా దినకర్, పోలీసు అధికారులు మంత్రితో కలిసి అమరులైన పోలీసులకు ఘన నివాళులర్పించారు. పెరేడ్ మైదానంలో అమరవీరుల స్థూపం వద్ద స్మృతి పరేడ్ ఘనంగా నిర్వహించారు.

– విశాలాంధ్ర, ఒంగోలు :

2లో

పోలీసు అమరవీరుల కుటుంబాలను ఆదుకుంటాం

ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్

విశాలాంధ్ర-ఒంగోలు : విధినిర్వహణలో, అసాంఘిక శక్తుల చేతిలో అసువులు బాసిన పోలీసు సిబ్బంది సంక్షేమ కోసం జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడు కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ దామోదర్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా విధినిర్వహణలో మరణించిన పోలీసు కుటుంబ సభ్యులతో సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఎస్పీ ప్రతి ఒక పోలీస్ కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి యోగక్షేమాలు, సమస్యలు, కుటుంబ స్థితి గతులు, బాగోగులు, ప్రభుత్వం పరంగా అందాల్సిన సౌకర్యాలు (బెనిఫిట్స్), గురించి ఎస్పీ స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

ఎమ్మెల్సీ ఓట్ల నమోదులో చురుకైన పాత్ర పోషించాలి : ఆనందబాబు

6లో

–విశాలాంధ్ర, వేమూరు :

జడ్పీకి పూర్వ వైభవం వచ్చేనా!

- నేడు జిల్లా పరిషత్ సమావేశం
- దూరంగా ఉంటున్న అధికార పక్షం ఎమ్మెల్యేలు, ఎంపీ
- ప్రస్తుత వైసీపీ గుప్పెట్లోనే జడ్పీ
- అందుకే దూరంగా ఉంటున్న అధికార పక్ష ఎమ్మెల్యేలు!

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం.. ఈ సమావేశానికి గతంలో ఎంతో ప్రాధాన్యత ఉండేది. మూడు నెలలకు ఒకసారి జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, జిల్లాలో నెలకొన్న ప్రధాన సమస్యలు, జిల్లాకు అవసరమైన సంక్షేమంపై ఈ సమావేశంలో చర్చించేవారు. జిల్లాకు సంబంధించిన అనేక అభివృద్ధిపై తీర్మానాలు చేసి ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చి తద్వారా ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టుకొని జిల్లా సమగ్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషించేవి జడ్పీ సమావేశాలు. మండల స్థాయిలో జడ్పీటీసీలు, ఎంపీపీలు ఈ సమావేశంలో పాల్గొనేవారు. ముఖ్యంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి.. జిల్లాకు చెందిన మంత్రులు, జిల్లా పరిషత్ చైర్మన్, కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు అందరూ ఈ సమావేశంలో పాల్గొని సమావేశంపై చర్చించే ఒక చక్కటి వేదిక.

– విశాలాంధ్ర బ్యూరో, ఒంగోలు :

7లో

రాష్ట్రంలో రాక్షస పాలన

- కలిసికట్టుగా పనిచేసి జగన్‌ను సీఎం చేద్దాం
- ప్రతి కార్యకర్తకు వెన్నంటే ఉంటా.. నిరుత్సాహపడొద్దు
- వైసీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున
- ఘనంగా జిల్లా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం

–విశాలాంధ్ర బ్యూరో,బాపట్ల :

7లో

త్యాగధనులకు ఘననివాళులు

- ఘనంగా పోలీసు అమరవీరుల దినోత్సవం
- నేరాలు నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు విశేష కృషి
- ఎస్పీ తుషార్ డూడీ

2లో

విధినిర్వహణలో అసువుల బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం అని జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం బాపట్ల పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్మృతి పెరేడ్ ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన పోలీసు అమరవీరుల స్థూపం వద్ద ఎస్పీ పుష్ప గుచ్ఛాలను ఉంచి ఘనంగా నివాళులర్పించారు. అడ్మిన్ ఆర్.ఐ షేక్.మౌలుద్దీన్ పెరేడ్ కమెండర్‌గా వ్యవహరిస్తూ ముఖ్య అతిథులకు గౌరవ వందనం సమర్పించి పోలీస్ వాయిద్యాలతో స్మృతి పేరేడ్‌ను నిర్వహించారు. బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు, అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, బాపట్ల డిఎస్పీ జి.రామాంజనేయులు, చీరాల డిఎస్పీ పి.జగదీష్ నాయక్ పోలీస్ అమరవీరుల త్యాగధనులందరికీ పుష్పగుచ్ఛాలతో ఘననివాళులు అర్పించారు.

– విశాలాంధ్ర, బాపట్ల

పంటలకు నష్టం

జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస రావు వెల్లడి

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : జిల్లాలో అల్పపీడనం ప్రభావంతో కురిసిన వర్షాలకు 17986. 175 ఎకరాలలో సజ్జ, మినుము, అలచంద, జొన్న, ప్రత్తి, వరి, కొర్ర పొగాకు పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనాలు అందినట్లు జిల్లా వ్యవసాయాధికారి ఎస్ శ్రీనివాస రావు తెలిపారు. జిల్లాలో 26 మండలాల్లో 119 గ్రామాల్లో 7241 మంది రైతులకు చెందిన ఆయా పంటలు 17986. 175 ఎకరాలు ఉన్నట్లు ప్రాథమిక అంచనాకు అందినట్లు వివరించారు.

నీలం నాగేంద్ర చొరవతో దళిత బాలిక కేసులో ఎఫ్ఐఆర్

విశాలాంధ్ర-ఒంగోలు : దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు ఫిర్యాదుతో నిర్లక్ష్యం వీడిన పోలీసులు దళిత బాలికపై అత్యాచారం చేసిన నిందితుడు షేక్ రసూల్ భాషాపై అత్యాచారం, ఫోక్సో యాక్టు, ఎస్సీ ఎస్టీ యాక్టు సెక్షన్లతో కేసు నమోదు చేశారు. దళిత బాలికకు రిమ్స్‌లో వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకుమాను రవి సోమవారం ఒంగోలులోని రిమ్స్ వద్ద విలేకరులతో మాట్లాడారు. నాగులుప్పలపాడు మండలం కొత్తకోట గ్రామానికి చెందిన దళిత బాలిక మేదరమెట్ల నుంచి ఇంటికి వస్తుండగా, పోలీసు దుస్తుల్లో ఉన్న షేక్.రసూల్ భాషా అటకాయించి అత్యాచారం చేశాడన్నారు. నాగులప్పలపాడు పోలీసులు క్రైమ్ నెంబర్ 154 /2024 గా, ఫోక్సో యాక్ట్, అత్యాచారం, మోసం, ఎస్సీ ఎస్టీ యాక్ట్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు

29 మందిపై కేసులు నమోదు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : కొనకనమిట్ల మండలంలోని పలు గ్రామాల్లో దర్శి విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పాలగిరి శ్రీనివాసులు, ఒంగోలు విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హైమావతి, పొదిలి విజిలెన్స్ డిఈఈ హరిబాబుల ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్ అధికారులు 42 గ్రూపులుగా విడిపోయి 72 మంది అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 29 మంది పై కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి అపరాధ రుసుము కింద 69 వేల రూపాయలు వసూలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్

ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రంగ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గం మరియు హెచ్ఎంపాడు మండల ప్రజల సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కేశవ కిషోర్ కుమార్,ఎస్ ఐ కే మాధవరావు,డిఎల్ఓ నరసింహారెడ్డి,డిప్యూటీ డిఈఓ చంద్రమౌళేశ్వరరావు,టిడిపి మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, మరియు అధికారులతో పాటు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలి

గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల

విశాలాంధ్ర-గిద్దలూరు : తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆరు మండలాల ముఖ్య నాయకులతో సమావేశమైన అశోక్ రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నవంబర్ - 26వ, తేదీన సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

పోలీసు అమరవీరుల త్యాగం వెలకట్టలేనిది..

- మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి
- ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

విశాలాంధ్ర-ఒంగోలు :
దేశ రక్షణ కోసం పోలీసులు చేసే ప్రాణత్యాగం వెలకట్టలేనిదని మంత్రి డోలా బాల వీరాంజనేయులు అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సోమవారం ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి భారతి, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సరియా,జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్, 3వ అదనపు జడ్జి డి.రాములు, 7వ అదనపు జడ్జి రాజా వెంకటాద్రి, 8వ అదనపు జడ్జి డి.అమన్ రాజా, డిఎల్ఎస్ఎ జడ్జి శ్యామ్ బాబు, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, రాష్ట్ర 20 సూత్రాలు ప్రోగ్రాం చైర్మన్ లంకా దినకర్ మరియు పోలీసు అధికారులు మంత్రితో కలిసి అమరులైన పోలీసులకు ఘన నివాళులర్పించారు. పెరేడ్ మైదానంలో అమరవీరుల స్థూపం వద్ద స్మృతి పరేడ్ ఘనంగా నిర్వహించారు. దేశం కోసం, ప్రజల కోసం ప్రాణాలు పణంగా పెట్టి పనిచేస్తున్న పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి చెప్పారు. దేశ రక్షణ కోసం, శాంతి భద్రతల పరిరక్షణ కోసం పనిచేసేలా పోలీసులను వెన్నుతట్టి ప్రోత్సహించి ఈ విధుల నిర్వహణ కోసం పంపిన కుటుంబ సభ్యులకు ప్రత్యేకముగా ఆయన నమస్కరించారు. వ్యక్తిగత జీవితం కంటే దేశ రక్షణకు, ప్రజల రక్షణకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తూ పోలీసులు చేసిన ప్రాణ త్యాగం వెలకట్టలేనిదని మంత్రి అన్నారు. అమరులైన పోలీసుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల ఎల్లవేళలా అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భముగా అందరికీ నమస్సుమాంజలులు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిమగ్నమై, విధినిర్వహణలో అశువులు బాసిన, అమర పోలీసు సోదరులకు భాష్పాంజలి ఘటిస్తూ యావద్భారత దేశం ఈ రోజు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం జరుపుకుంటున్నదని తెలిపారు.

మరణించిన పోలీస్ కుటుంబాలకు ప్రభుత్వం, పోలీసు శాఖల ఆర్థిక చేయూత

ప్రకాశం జిల్లాకు చెందిన పోలీసు అమరవీరులు కుటుంబ సభ్యులతో మంత్రి మాట్లాడి వారికి బహుమతులు అందజేశారు. అలాగే జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వర్తిస్తూ దురదృష్టవశాత్తూ మరణించిన యన్.నెమిలి రెడ్డి యొక్క సతీమణి రాధ, జి.శివ ప్రసాద్ యొక్క సతీమణి స్వర్ణ కుమారి,అబ్దుల్ రహీమ్ యొక్క సతీమణి షాహినా, యస్.రవి యొక్క సతీమణి మల్లేశ్వరి యొక్క కుటుంబ సభ్యులకు లక్ష రూపాయల కార్పస్ ఫండ్ చెక్కులను మంత్రి చేతుల మీదగా అందచేసినారు.

ఈ సంవత్సరం దేశ వ్యాప్తముగా ప్రాణాలను కోల్పోయిన 216 మంది పోలీస్ బలగాల సిబ్బంది యొక్క పేర్లులను అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) శ్రీ.నాగేశ్వర రావు కార్యక్రమములో చదివి విన్పించి శ్రద్ధాంజలి ఘటించినారు. అనంతరం పోలీస్ పెరేడ్ గ్రౌండ్ నందు పోలీస్ అమరవీరుల ర్యాలీలో మంత్రి,జిల్లా జడ్జి,జిల్లా కలెక్టర్ ,ఎస్పీ మరియు ప్రజాప్రతినిధులు జెండా ఊపి ప్రారంభించారు. పోలీస్ పెరేడ్ గ్రౌండ్ నుండి ఆర్.టి.సి బస్టాండ్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో పోలీసులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు మరియు ప్రజలు అమరవీరులకు జోహార్లు అంటూ నినాదాలు చేసినారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, ఉప రవాణా శాఖ కమిషనర్ శ్రీమతి అర్.సుశీల, ఒంగోలు ఆర్డీఓ కె.లక్ష్మి ప్రసన్న, ఒంగోలు డిఎస్పీ ఆర్. శ్రీనివాసరావు, ఎఆర్ డిఎస్పీ చంద్ర శేఖర్, డాక్టర్లు, సీఐలు పాల్గొన్నారు.

త్యాగధనులకు ఘననివాళులు

- ఘనంగా పోలీసు అమరవీరుల దినోత్సవం
- నేరాలు నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు విశేష కృషి
- ఎస్పీ తుషార్ డూడీ

విశాలాంధ్ర - బాపట్ల : విధినిర్వహణలో అసువుల బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం అని జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం బాపట్ల పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్మృతి పెరేడ్ ఆదివారం ఘనంగా జరిగింది. పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన పోలీసు అమరవీరుల స్థూపం వద్ద ముఖ్యఅతిథి జిల్లా ఎస్పీ తుషార్ డూడి పుష్ప గుచ్ఛాలను ఉంచి ఘనంగా నివాళులర్పించారు. అడ్మిన్ ఆర్.ఐ షేక్.మౌలుద్దీన్ పెరేడ్ కమెండర్‌గా వ్యవహరిస్తూ ముఖ్య అతిధులకు గౌరవ వందనం సమర్పించి పోలీస్ వాయిద్యాలతో స్మృతి పేరేడ్‌ను నిర్వహించారు. అమరవీరుల వివరాలతో ఉన్న షహీద్ పుస్తక్ టోలిని ఆర్.ఎస్.ఐ ఎన్.గోపి ధీరే చల్‌లో వచ్చి ముఖ్య అతిథికి అందించారు. జిల్లా ఎస్పీ బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు, అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, బాపట్ల డిఎస్పీ జి.రామాంజనేయులు, చీరాల డిఎస్పీ పి.జగదీష్ నాయక్, రేపల్లె డిఎస్పీ ఏ.శ్రీనివాసరావు, ఏ.ఆర్ డిఎస్పీ ఎస్.చంద్రమోహన్ లు పోలీసు అమర వీరుల స్థూపం వద్దకు చేరుకుని అంకితభావంతో సేవలందిస్తూ ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగధనులందరికీ పుష్పగుచ్ఛాలతో ఘననివాళులు అర్పించారు. ధైర్య సహసాలతో ప్రజా సేవ చేస్తూ అసాంఘిక శక్తులతో పోరాడుతూనే అసువులు బాసిన పోలీస్ వీరులను స్మరించుకుంటూ అతిథులు, సభికులంతా రెండు నిమిషాలు మౌనం పాటించారు. షహీద్ పుస్తక్ టోలిలో ఉన్న అమరవీరుల పేర్లను అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ చదివి వినిపించారు. ఈ ఏడాది దేశ వ్యాప్తంగా 214 మంది తమ ప్రాణాలను కోల్పోయారని వారిలో ఇద్దరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మృతి చెందారని వారికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 1959 అక్టోబరు 21న సీఆర్పీఫ్ చెందిన 21 మంది సభ్యుల బృందం భారత్-చైనా సరిహద్దుల్లోని అక్సాయ్ చిన్ ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తుండగా చైనా బలగాలు భారత దేశంలోని సియాచిన్ భూభాగాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిం చడంతో వారికి దీటుగా ఎదురొడ్డి పోరాడినారన్నారు. ఆ పోరాటంలో పది మంది భారత జవాన్లు వీరమరణం పొందారని వారి పోరాటపటిమను త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21వ తేదీ పోలీసుల అమర వీరుల సంస్మరణ దినోత్సవంగా జరుపుకుంటామన్నారు. రాత్రి, పగలు, ఎండ, వాన తేడా లేకుండా 24/7 గంటలు చేసే ఉద్యోగం పోలీస్ ఉద్యోగమన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడడంలో, ట్రాఫిక్ క్రమ బద్ధీకరించడంలో, నేరాలను నియంత్రించ డంలో, శాంతిభద్రతలు పరిరక్షించడంలో పోలీస్ శాఖ విశేషంగా కృషి చేస్తుందన్నారు. జిల్లా అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ మరికొంతమంది పోలీస్ సిబ్బంది ప్రజల రక్షణకై తమ ప్రాణాలను సైతం పణంగా పెడుతూ వరద ముంపు గ్రామాలలో నాలుగు రోజుల పాటు ఉండి వరద ఉధృతి తగ్గిన తరువాత, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేదని నిర్ధారించుకున్న తరువాత అక్కడ నుండి వచ్చారన్నారు. జిల్లా వ్యాప్తంగా అక్టోబర్ 21 నుండి 31వ తేదీ వరకు పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహించనున్నామన్నారు. సెమినార్‌లు, పోలీస్‌లలో ఐక్యత భావం వర్ధిల్లేలా పోలీస్‌లతో సమైక్యతా పరుగు, పోలీసులు ఉపయోగించే ఆయుధాలు వాటి యొక్క ఉపయోగాలను గురించి విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పోలీస్ సిబ్బంది వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తామన్నారు. బ్లడ్ బ్యాంకు కేంద్రాలకు రక్తాన్ని దానం చేసేందుకు రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించి బహుమతులు అందించనున్నామన్నారు. బాపట్ల శాసనసభ్యులు మాట్లాడుతూ సమాజంలో ఉన్న ఒడిదుడుకులను తట్టుకుంటూ, అసమాన్య పరిస్థితులను సరి చేసే వ్యవస్థ పోలీస్ వ్యవస్థని, భారత దేశంలో ఎక్కడ అవాంఛనీయ కార్యకలాపాలు జరగకుండా ప్రముఖ పాత్రపోషిస్తున్న పోలీసులు ప్రజల ప్రాణాలను రక్షించడంలో తమ ప్రాణాలు సైతం త్యాగం చెయ్యడానికి వెనకాడబోరన్నారు. ఎంతో అంకిత భావంతో పనిచేసే పోలీసులు జిల్లాలో ఉన్నారని తెలిపారు. బండ్లమోటులో రెవిడిచర్ల పంచాయితిలో 2001 లో ఎన్నికల బందోబస్తు కోసం వెళ్లి తిరిగివస్తూ నక్సల్స్ దాడిలో అశువులుబాసిన కానిస్టేబుళ్లు వై.మస్తాన్ బాబు, ఐ.వెంకటేశ్వర్లు, 2003లో దాచేపల్లిలో జరిగిన నక్సలైట్ల క్లేమోర్‌మైన్ పేల్చిన ఘటనలో అశువులుబాసిన కానిస్టేబుల్ పి.శ్రీనివాసరావు, చెరుకుపల్లి స్టేషన్‌పై నక్సల్స్ దాడి చేసిన ఘటనలో అశువులు బాసిన కానిస్టేబుల్ డి.దేవదానం కుటుంబ సభ్యులతో మాట్లాడి, పోలీస్ అమరవీరుల కుటుంబాలకు ఎల్లపుడు అండగా ఉంటామని ఎస్పీ ధైర్యం చెప్పారు. అనంతరం పట్టణంలో పోలీసులతో పాటు విద్యార్థిని, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అమరులకు జోహార్లు అర్పిస్తూ నినాదాలు చేసుకుంటూ బాపట్ల పట్టణ పోలీస్ స్టేషన్ నుండి భావనారాయణ స్వామి గుడి మీదుగా డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్ళి మానవహారంగా ఏర్పడి అమరవీరులకు జోహార్లు అంటూ నినాదాలు చేశారు.

ముంచిన వాన

పొలాల్లో నీరు, మిర్చి, బొప్పాయి పంటలకు నష్టం

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : ఎడతెరిపిలేని వర్షాలతో రైతులు కుదేలవుతున్నారు. రెండు వారాలుగా కురుస్తున్న జల్లులకు పంటలన్నీ ఉరకలెత్తుతూ తెగుళ్ల గుప్పిట చిక్కాయి. పురుగు మందులు కొట్టేందుకు వరుణుడు సమయం ఇవ్వకపోవడంతో మిర్చి, పత్తి, కంది, బొప్పాయి తదితర పంటలపై వైరస్ తెగుళ్లు విజృంభిస్తున్నాయి. చీడ ఎక్కువైన మిరప మొక్కలను తొలగిస్తున్నారు. పొగాకు తోటలన్నీ ఎర్రగా మారి బొంతాకుగా మారి నాణ్యత, దిగుబడి తగ్గుతోందని అన్నదాతలు విలవిల్లాడుతున్నారు. ఆదివారం, సోమవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షం మరింత నష్టం చేకూర్చుతుందని వాపోతున్నారు. మండలంలోని సర్వాయిపాలెం, బోయలపల్లి, అమానిగుడిపాడు, గంగపాలెం, నర్సాయపాలెం, గుర్రపుసాల తదితర గ్రామాలలో వందల ఎకరాలలో బొప్పాయి చెట్లు విరిగాయి. మిర్చి పంట నేలకు ఒరిగింది. ప్రభుత్వం స్పందించి పరిహారం అందించాలని కోరుతున్నారు. త్రిపురాంతకం మండలంలో 9వేల ఎకరాల్లో మిర్చి, 400 ఎకరాల్లో పొగాకుతో పాటు మొక్కజొన్న, వరి, కంది సాగు చేశారు. వర్షాలకు

రామసముద్రం రేగడి నేలల్లో సాగు చేసిన పొగాకు ఉరకెత్తి ఎర్రగా ఎండిపోతోంది. లేళ్లపల్లి, చెర్లోపల్లిలో కొట్టుడుకు వచ్చిన పొగాకు తడవడంతో రంగు మారింది. సాగర్ ఆయకట్టులోని గ్రామాలతో పాటు మెట్ట ప్రాంతం లోని లోతట్టు భూముల్లో సాగు చేసిన మిర్చి ఉరకేస్తోంది. పూత, కాపు దశలోని పంట ఒడలిపోతోంది. మేడపి, గణపవరం, అన్నసముద్రం తదితర చోట్ల ఇటీవల నాటిన మొక్కజొన్న మొలకెత్తే దశలో ఉండగా వాన నీటికి చాలా పొలాల్లో మొలవ లేదు. అరకొర వచ్చిన మొక్కలు వర్షపు నీరు నిల్వ చేరడంతో ఎండిపోతున్నాయి. రామసముద్రం, మిట్ట పాలెం తదితర చోట్ల సాగులోని కంది ఉర కెత్తి ఎండిపోతుంది. అన్నసముద్రం పొలాల్లో వేసిన వరి నాట్లు చెరువు నీరు ప్రవహిస్తుండటంతో మునిగిపోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

23న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-కొనకనమిట్ల : కొనకనమిట్ల మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 23వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశపు హాలులోఎంపీపీ ఎం మురళీకృష్ణ అధ్యక్షతన జరుగుతుందని, ఎంపీడీవో డి ఈశ్వరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో అన్ని ప్రభుత్వ శాఖల పని పనితీరుపై సమీక్ష జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి జడ్పిటిసి, ఎంపీటీసీ సభ్యులు, అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు విధిగా సకాలంలో సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

విశాలాంధ్ర-తాళ్లూరు : పంచాయితీలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోనున్నట్లు ఇన్చార్జి గ్రామకార్యదర్శి ఇడమకంటి రమణా రెడ్డి అన్నారు. నాగంబొట్ల పాలెం గ్రామకార్య దర్శి అయిన ఆయన తాళ్లూరు ఇన్చార్జి గ్రామ కార్యదర్శిగా సోమవారం బాధ్యతలు చేపట్టారు. తాళ్లూరు నుండి బదిలీ అయిన గ్రామకార్యదర్శి నూర్ అహ్మద్ ఆయనకు పూర్తి రికార్డులను అప్పగించారు. ఈ సందర్భంగా గ్రామకార్యదర్శి ఐ రమణా రెడ్డి మాట్లాడుతూ ప్రాధాన్యత క్రమంలో పారిశుధ్య పనులు, బోర్ల మరమ్మత్తులు చేపడతామని, పంచాయితీ ఆదాయ వనరులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.

వర్షాలకు కుప్పకూలిన ఇల్లు

విశాలాంధ్ర-తాళ్లూరు : తాళ్లూరులో పడమటి బజారులో మారం నాగేశ్వరమ్మకు చెందిన పెంకు టిళ్లు ఇటీవల రోజు కురుస్తున్న వర్షాలకు నాని పోయి కూలిపోయినది. ఇల్లు మధ్య బాగం నుండి ఒక వైపు పూర్తిగా కూలి పోవటంతో పాటు ఇల్లు కూడ పూర్తిగా దెబ్బ తిన్నది. పేదలమైన తమ నివాసం కూలి పోవట తో నివాసానికి పూర్తిగా ఇబ్బందికర మైనదని, తహసీల్దార్ స్పందించి ఆదుకోవాలని మారం నాగేశ్వరమ్మ కుటుంబసభ్యులు కోరుతున్నారు.

నట్టల నివారణ మందులు పంపిణీ

విశాలాంధ్ర-తాళ్లూరు : సన్న జీవాల పోషకులు తమ జీవాలకు నట్టల నివారణ మందులు తాగించి రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవాలని తాళ్లూరు పశువైద్యశాల వైద్యాధికారి డాక్టర్ వి. ప్రతాప్ రెడ్డి అన్నారు. తాళ్లూరులో సోమవారం నట్టల నివారణ మందులను గొర్రెలకు, మేకలకు తాగించారు. ఏలిక పాములు, జలగలు, బద్దె పురుగుల వల్ల గొర్రెలు, మేకలలో రోగ నిరోధక శక్తి తగ్గి రోగాల బారిన పడే అవకాశం ఉందని చెప్పారు. సన్న జీవాల పోషకులు ఈ అవకాశాన్ని ఉపయోగించు కొని తమ జీవాలకు నట్టల నివారణ మందును తాగించాలని కోరారు. అనంతరం 500 జీవాలను నట్టల నివారణ మందు తాగించారు. గ్రామ టిడిపి నాయకుడు ఐ శ్రీనివాస రెడ్డి, గ్రామ పశుపోషక సహాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన డిప్యూటీ తహశీల్దార్

విశాలాంధ్ర-గిద్దలూరు : నూతన డిప్యూటీ తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన అత్తార్ నాయబ్ హుస్సేన్ సోమవారం గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల శాలువాతో సత్కరించడం జరిగింది. అర్ధవీడు మండల రెవిన్యూ కార్యాలయంలో డీటీగా పనిచేసి ప్రస్తుతం సాధారణ బదిలీలో భాగంగా గిద్దలూరు రెవిన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ తహశీల్దార్ నాయబ్ హుస్సేన్ మాట్లాడుతూ ఎల్లవేళలా ప్రజల సమస్యలు తెలుసుకుని తీర్చడమే తమ బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోల సంఘం నాయకులు, కంభం తెలుగుదేశం పార్టీ నాయకుడు దాదా తదితరులు పాల్గొన్నారు.

23న వెలిగండ్లలో ప్రజా దర్బార్

విశాలాంధ్ర-వెలిగండ్ల : ఈ నెల 23వ తేదీ బుధవారం వెలిగండ్ల ఎంపీడీవో కార్యాలయం నందు ప్రజాదర్బార్ నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అర్జీరూపణ ఉదయం 9 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే ప్రజాదర్బార్కు రావాలని సూచించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొని మీ సమస్యలను పరిష్కారం చూపిస్తారని తెలిపారు.

వద్దిపాడులో పారిశుధ్య పనులు

విశాలాంధ్ర-దొనకొండ: మండలంలోని వద్దిపాడు పంచాయతీలో సర్పంచ్ నూనె సరోజా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. రోడ్లు వెంట పెరిగిన చిల్ల చెట్లు తొలగించటం, సైడు కాలువలో పూడిక తీత చేపట్టి వర్షాలకు నిలిచిన నీటిని ఆ కాలువల్లోకి మళ్లించటం వంటి పనులు చేపట్టారు. ఇంటి పరిసరాల్లో చెత్త వేయకుండా, వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. దోమల ఉధృతి పెరగకుండా తగు చర్యలు తీసుకుంటామని పారిశుధ్యానికి పంచాయతీ ప్రజలంతా తమ వంతు సహకారం అందించాలని సర్పంచ్ కోరారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసులు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవని దర్శి డివిజన్ విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పాలగిరి శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రమైన కొనకనిమెట్లలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొనకనమిట్ల మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ అధికారులు 42 బృందాలుగా విడిపోయి తనిఖీలు చేయడం జరుగుతుందని, ఎవరైనా అక్రమంగా విద్యుత్తును వినియోగించినట్లయితే వారిపై కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. అల్పపీడనం కారణంగా గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ట్రాన్స్ఫార్మర్లు విద్యుత్ మోటార్ల వద్ద తడిచేతులు పెడితే ప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉందన్నారు. షాపులు కిరాణా బంకులు, వద్ద నాసిరకం వైర్ కనెక్షన్లు ఇచ్చుకో రాదని గ్రామాల్లో లో వోల్టేజ్ సమస్య ఉంటే విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకొస్తే వారుసమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు .ఈ కార్యక్రమంలో విద్యుత్ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హైమావతి, పొదిలి విజిలెన్స్ డిఈఈ హరిబాబు, విద్యుత్ విద్యుత్ ఏ ఈ వీరబ్రహ్మం, విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముటుకుల మర్రివేముల రోడ్లకు శంకుస్థాపన

విశాలాంధ్ర-పుల్లలచెరువు : రాష్ట్ర అభివృద్ధికోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అహర్నిశలు శ్రామిస్తున్నారని ఎర్రగొండపాలెం నియోజకవర్గ కూటమి ఇంచార్జి గూడూరి ఏరిక్షన్ బాబు అన్నారు. మండలంలోని ముటుకుల, సింగుపల్లి, మర్రివేముల గ్రామాలలో పల్లె పండుగ కార్యక్రమం ఆదివారం జరిగింది. కూటమి ఇంచార్జ్ ఏరిక్షన్ బాబుకు ఆయా గ్రామాల టిడిపి నాయకులు, గ్రామస్థులు పూలతో ఘన స్వాగతం పలికారు. ఏరిక్షన్ బాబు మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పూనుకుందన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఒక్కటొక్కటిగా అమలు చేస్తుందన్నారు. గ్రామాల్లో సిసిరోడ్లు, డ్రైనేజీ లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీపావళికి మూడు సిలిండర్లను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ముటుకుల గ్రామంలో 10 లక్షలు, సింగుపల్లి గ్రామంలో 10లక్షలు, మర్రివేముల గ్రామంలో 10 లక్షలతో సిసి రోడ్లకు కూటమి ఇంచార్జి ఏరిక్షన్ బాబు భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి కాకర్ల కోటయ్య, మండల కన్వీనర్ పయ్యావుల ప్రసాద్, మండల నాయకులు మాజీ మండల పార్టీ నాయకులు సన్నగా నారాయణరెడ్డి బివిసుబ్బారెడ్డి, అధికారులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత బస్సు ఎప్పుడు..?

సయ్యద్ జావిద్ అన్వర్

విశాలాంధ్ర-మార్కాపురం : టిడిపి నేత చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని వెంటనే అమలు చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు షర్మిలమ్మ ఆదేశాల మేరకు మార్కాపురం నుండి దోర్నాల వెళ్లే ప్రయాణికులతో కలిసి సోమవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి సయ్యద్ జావీద్ అన్వర్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. బస్సులో ప్రయాణించే మహిళలకు టిక్కెట్టును అందించి ఉచిత బస్సు హామీ ఏమైంది బాబు? అమలు ఎప్పుడు? అంటూ నినాదాలు చేశారు. సందర్భంగా కాంగ్రెస్ నేత సయ్యద్ జావిద్ అన్వర్ మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి120 రోజులు దాటినప్పటివరకు ఏ హామీ నెరవేర్చకపోవడం చూస్తే ఎన్నికల కోసమే హామీలు ఇచ్చినట్లు వుందని ఎద్దేవా చేశారు.ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తామని ఖర్చు లేకుండా రాష్ట్రంలో ఎక్కడైనా ప్రయాణం చేయవచ్చని ప్రగల్భాలు పలికిన కూటమి సర్కార్ ఇప్పటివరకు అమలు పరచకపోవడం ఆశ్చర్యాన్ని కలిగించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గాలి వెంకటరామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, షేక్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో రాష్ట్రస్థాయికి క్రీడాకారుల ఎంపిక

విశాలాంధ్ర - ఒంగోలు : ఒంగోలు నగరం త్రోవకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం అండర్-17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్ పోటీలకు బాల బాలికలకు ఎంపికలు జరిగాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 12 నియోజకవర్గాల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరుకాగా వారిలో 12 మంది బాలురను ఎంపికచేశారు. అందులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాజుపాలెం (కొమరోలు మండలం) 10వ తరగతి విద్యార్థి జయచంద్ర రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక కావడం జరిగింది. రాష్ట్రస్థాయిలో వాలీబాల్ పోటీలు ఈనెల 21వ తేదీ నుండి23వ తేదీ వరకు హిందూపురం జరిగే అంతర్ జిల్లా వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారు. రాష్ట్రస్థా యి పోటీలకు ఎంపికైన జయచంద్రను పాఠశాల ప్రధానోపాధ్యాయులు గర్రె చంద్రశేఖర్, పిడి పరిమళ పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.ఈ సందర్భంగా ఒక గ్రామస్థాయి విద్యార్థి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం తమకు గర్వకారణం అని తెలియజేస్తూ విద్యార్థిని మరియు వ్యాయామ ఉపాధ్యాయు రాలు పరిమళని పాఠశాల ప్రధానోపాధ్యాయులు,పాఠశాల సిబ్బంది, పలువురు గ్రామ ప్రముఖులు అభినందనలు తెలియజేశారు.

సమాజంలో పోలీసుల పాత్రపై వ్యాస రచన

విశాలాంధ్ర-దొనకొండ: నేటి సమాజంలో పోలీసుల పాత్రపై వ్యాస రచన పోటీలను స్థానిక గౌతమీ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించారు. ఈ పోటీలో కె.శ్రావణి, కె.సరస్వతి, వై.నేతన్ ఉత్తమ ప్రతిభ కనబరచటంతో అడ్మిన్ నాని, ప్రిన్సిపల్ రామయోగి బహుమతులు అందజేశారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల అమర వీరుల త్యాగాలు మరువలేనివంటూ వారు విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది పోలీసు అమర వీరులకు వందనం చేసి ఘనంగా నివాళులర్పించారు.

భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయండి

విశాలాంధ్ర-తాళ్లూరు : ఏళ్ల తరబడి తిరుగుతున్నా తన భూమిని ఆన్ లైన్ చేయటం లేదని తాళ్లూరుకు చెందిన చందోలు రామారావు సోమవారం స్పందనలో తహసీల్దార్ నాగలక్ష్మికి విన్నవించారు. పరిశీలించి న్యాయం చెయ్యాలని కోరారు. స్పందన కార్యక్రమంలో ఎంపీడీఓ సుందర రామయ్య, డిప్యూటీ తహసీల్దార్ ఇమ్మానియేల్ రాజు, ఎంఈఓ జి సుబ్బయ్య, వ్యవసాయాధికారి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఈఓగా శ్రీకీర్తి బాధ్యతలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : ముండ్లమూరు మండల మారెళ్ళ క్లస్టర్ వ్యవసాయ శాఖ ఏఈఓ గా వేమూరి శ్రీకీర్తి సోమవారం నూతన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏఈఓ పోస్టు ఖాళీగా ఉండటంతో ఇక్కడకు వచ్చారు. ఈమె మేదరమెట్ల లో పని చేస్తూ పదోన్నతి పై ముళ్ళమూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారెళ్ళ క్లస్టర్ పరిధిలోని గ్రామాలలో వ్యవసాయ రైతులకు అందుబాటులో ఉండి వారికి సూచన సలహాలు ఇస్తూ, రైతుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం వ్యవసాయ అధికారి మహమ్మద్ ఫారుక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

చినుకు పడితే చిత్తడే

- మరమ్మతులకు నోచుకోని రోడ్లు
- అంతర్గత రహదారులు అధ్వానం
- మరమ్మతులు లేక రాకపోకలకు కష్టం

విశాలాంధ్ర-పుల్లలచెరువు : మండలంలోని పలు గ్రామాల రహదారి పరిస్థితి అధ్వాన్నంగా నెలకొన్నది. పుల్లల చెరువు, గంగవరం, కవలకుంట్ల, నాయుడుపాలెం, తెల్లగట్ల, ముటుకుల, సింగుపల్లి, గ్రామాల్లో మధ్య ఉన్న అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. అక్కాపాలెం నుండి మర్రివేముల వెళ్ళే రహదారి మరీ అధ్వానంగా మారింది. ఎన్నో ఏళ్లుగా మరమ్మత్తులు చేపట్టకపోవడంతో రాకపోకలు కష్టంగా మారింది. అసలే వర్షాకాలం చినుకు పడితే అరచేతిలో ప్రాణాలు రోడ్లన్ని సముద్రాన్ని తలపించేలా అధ్వానంగా తయారవుతున్నాయి. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.నిత్యం వందల సంఖ్యలో వాహనాలతో రద్దీగా ఉండే ప్రధాన ఆర్అండ్‌బీ రహదారులు సైతం దెబ్బతిని గోతులుగా మారినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీనికి తోడు ఎత్తుపల్లాలుగా మారిన రోడ్లలో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురి అయ్యే పరిస్థితి ఏర్పడింది. పుల్లల చెరువు మండల పరిధిలోని యర్రగొండపాలెం, వినుకొండ వైపు వెళ్లే తెల్లగట్ల, ముటుకుల రోడ్లలలో వాహనాలు సైతం జారీ పడ్డ సందర్భాలు లేకపోలేదు. నడిచి వెళ్ళే వారే జారీ పడ్డారంటే వాహనదారుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలి.గుంతల రోడ్లో ప్రయాణించాలి అంటేనే వాహన దారులు బెంబేలెత్తున్నారు.పుల్లల చెరువు నుండీ యర్రగొండపాలెం, మార్కాపురం పట్టణలకు వెళ్ళే రహదారి గుత లమయ్యం అయ్యింది. గ్రామాలలో సైడు కాలువలు లేకపోటం వల్ల రోడ్లు జలమయం అవుతున్నాయి.

గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ గుంతలమయం అయ్యాయి. ఆ రోడ్లపై ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పోవాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లన్నీ మరమ్మత్తులు చేసే విధంగా చూడాలని మండల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. గత కొద్ది సంవత్సరాల క్రితం రోడ్డు వేశారు. ఇంతవరకు మరమ్మతులు చేసిన పాపాన పోలేదని అవసరం అయినా చోట చపట్టాలు ఏర్పాటు చేయాలని ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పోలీస్ అమరవీరుల దినోత్సవం

విశాలాంధ్ర-చీమకుర్తి : చీమకుర్తి పోలీస్ స్టేషన్లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సోమవారం నిర్వహించారు. సీఐ.ఎం.సుబ్బారావు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎంతోమంది పోలీసులు సంఘ విద్రోహ శక్తులను అణచే క్రమంలో అసువులు బాశారన్నారు. చీమకుర్తి నెహ్రూనగర్ నుంచి చీమకుర్తి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఎస్సై యు.కృష్ణయ్య, పోలీస్ సిబ్బంది,విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు.

ఇన్‌చార్జి వీఆర్వోల నియామకం

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని పలు గ్రామాలకు ఇన్చార్జి వీఆర్వోలుగా పలువురు నియమితులయ్యారని తహసీల్దార్ ఎల్ లక్ష్మీనారాయణ తెలిపారు. రాఘవరెడ్డి సింగనపాలెం వీఆర్వోగా పని చేస్తూ, నాయుడుపాలెంకు ఇన్చార్జి, సుజాత శంకరాపురం వీఆర్వో ఒక పని చేస్తూ, నూజిల్లపల్లికి ఇన్చార్జి, సిహెచ్ బ్రహ్మ తేజ ఉమామహేశ్వరపురం వీఆర్వోగా పని చేస్తూ, పోలవరంకి ఇంచార్జి, బి.గురవయ్య పసుపుగల్లు వీఆర్వోగా పని చేస్తూ, మారెళ్లకు ఇన్చార్జి, కే దయానందం ఈదర వీఆర్వోగాపని చేస్తూ, ముండ్లమూరుకు ఇన్చార్జి, ఎం పెద్దన్న వేముల వీఆర్వోగా పని చేస్తూ, పెద ఉల్లగల్లు కు ఇంచార్జి, జి కోటయ్య పులిపాడు వీఆర్ఓ ఒక పని చేస్తూ, వేముల బండకు ఇన్చార్జిగా నియమితులయ్యారని తహసీల్దార్ ఎల్ లక్ష్మీనారాయణ తెలిపారు.

వ్యాయామంతో ఆరోగ్యం పదిలం

విశాలాంధ్ర-ముండ్లమూరు : ప్రతి ఒక్కరు ఉదయం సాయంత్రం వేళల్లో వ్యాయామం చేస్తే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఫిజియోథెరపీ వైద్యాధికారి ఆర్ రాజశేఖర్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం ఫిజియోథెరపీపై వీవో ఎల్‌కు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం వెలుగు ఏపీఎం ఎం హనుమంతరావు అధ్యక్షతన జరిగినది. ఆయన మాట్లాడుతూ ఎవరికైనా ప్రమాదాలు జరిగిన సమయంలో కాళ్లు చేతు లకు దెబ్బలు తగిలినప్పుడు ఫిజియోథెరపీ చేయించుకోవాలన్నారు. శరీరంలో నొప్పులు ఎక్కువగా ఉన్నట్లయితే పెయిన్ కిల్లర్ వాడినట్లయితే సైడ్ ఎఫెక్ట్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల సాధ్యమైనంతవరకు ఫిజియోథెరపీ చేయించుకోవాలన్నారు. మొబైల్ ఎక్కువగా వాడినట్లయితే చేతులు లాగడం, తలనొప్పి, మెడ నొప్పి, కళ్ళు నొప్పులుగా ఉండటం వచ్చిన సమయంలో ఫిజియోథెరపీ చేయించుకున్నట్లయితే ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఫిజియోథెరపీ చేయించుకున్న అందువల్ల బీపీ షుగర్ రావు అన్నారు. బ్యాక్ పెయిన్ వచ్చినప్పుడు హీట్ ప్యాచ్ వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు కె కోటేశ్వరరావు, ఎం దాసు, ఫిజియోథెరపీ ట్రైనర్ రాంజీ గోవింద్, వివో ఏలు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతంగా మార్కాపురం రైల్వే స్టేషన్

డీఆర్‌యూ సీసీ మెంబర్ ఆర్‌కేజీ నరసింహం

విశాలాంధ్ర-మార్కాపురం : గుంటూరు డివిజనల్ రైల్వే యూజర్స్ కమిటీ (డీఆర్‌యూసీ)మెంబర్‌గా అర్ కె జి నరసింహం నియమితులయ్యారు. ఈ మేరకు డివిజనల్ రైల్వే మేనేజర్ రామకృష్ణ నుండి శనివారం ఆయన అధికారికంగా ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆర్కేజి మాట్లాడుతూ కేంద్ర రైల్వే శాఖ దేశంలో కొన్ని ప్రాంతాలను అమృత భారత్ పథకం కింద ఎంపిక చేసిందని, అందులో మార్కాపూర్ రైల్వే స్టేషన్ కూడా వుందని అన్నారు. మార్కాపూర్ రైల్వే స్టేషన్‌కు దేశములోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలం కేవలం 80 కిలోమీటర్ల దూరం ఉండడంతో ఈ రైల్వే స్టేషన్‌ను పర్యాటక ప్రాంతంగా గుర్తిస్తూ కేంద్ర రైల్వే శాఖ ఆదేశాలు జారీ చేసిందని ఆయన తెలిపారు. అమృత్ భారత్ పథకం కింద ఎంపిక కావడంతో రైల్వేస్టేషన్లో రూ.20 కోట్ల నిధులతో అత్యంత ఆధునీకరణతో నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. అందులో భాగంగా ఒకటి, రెండు ప్లాట్ ఫామ్ లలో రూఫ్ (షెడ్)లు, ప్రయాణికుల సౌకర్యార్థం అధునాతమైన 2 లిఫ్టలు, ట్రెయిన్ ప్లాట్ ఫామ్‌లకు చేరుకున్నప్పుడు కోచ్ ఇండికేషన్ బాక్స్‌లకు సంబంధించి నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. అలాగే వెయిటింగ్ హాల్,ఎయిర్ కండిషన్ రెస్ట్ రూమ్‌లు, టాయిలెట్ గదులు నిర్మాణంలో వున్నాయని అన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని మరొక కాలి నడక వంతెనను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు.

ఘనంగా పోలీస్ అమరవీరుల దినోత్సవం

విశాలాంధ్ర - బల్లికురవ : మండలంలో పోలీస్ అమరవీరుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఎస్ఐ జీవి చౌదరి ఆధ్వర్యంలో బల్లికురవ పోలీస్ స్టేషన్ వద్ద నుండి స్థానిక నాలుగు రోడ్ల కూడలి వరకు విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ త్యాగధనులైన పోలీస్ అమరవీరుల కీర్తిని కొనియాడారు.రోజులు 24 గంటలు విధి నిర్వహణ బాధ్యతలు నిర్వహించేది ఒక్క పోలీస్ మాత్రమే అని,పోలీసు లేని సమాజాన్ని ఊహించు కోవడం కష్టసాధ్యమవుతుందని ప్రజలంతా పోలీసులకు సహాయ సహకారాలు అందించాలన్నారు.ప్రజలంతా నిద్రలో ఉంటే పోలీసు వ్యవస్థ మాత్రం మేల్కొని శాంతిభద్రతలు పరిరక్షిస్తూ తీవ్రవాదుల దుశ్చర్యలకు ఎంతో మంది పోలీసులు తమ ప్రాణాలను పోగొట్టుకొని అమరుల వుతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు.పోలీస్ అమరవీరుల స్మృతి చిహ్నంగా అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల దినోత్సవం జరుపుకుంటున్నా మన్నారు.నేడు దేశంలో జరిగే ఘటనలన్నీ క్షణాల వ్యవస్థలో ఫోన్ల ద్వారా ప్రతి ఒక్కరికి తెలుస్తోందని విద్యార్ధిని విద్యార్థులు కేవలం మంచిని మాత్రమే తీసుకొని చెడుకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్ధిని విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా దేశ రక్షణకై తమ వంతు కృషి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది విద్యార్ధిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతల ప్రాణాలు కాపాడండి:ఎస్సై మురళి

విశాలాంధ్ర-దర్శి : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా దర్శి పోలీస్ స్టేషన్లో మంగళవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని రక్తదానం చేయాలని కోరారు. నారాయణ స్వామి, సీఐ రామారావుల పర్యవేక్షణలో ఈ రక్తదాన శిబిరం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. స్థానిక పోలీస్ స్టేషన్లో పేరు నమోదు చేయించుకుని వివరాలను ఇవ్వాలని తెలిపారు. అనంతరం దర్శి పట్టణంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలను మరువలేని వారు అసురుపాసి ఎందరో నాయకులను ప్రజలను వారిని ఇలా స్మరించు కోవడం వారి ఘనమైన నివాళి ఇవ్వడమేనని వారి కుటుంబాలకు అందరిం అండగా ఉండి మనోధైర్యాన్ని నింపాలని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

23 నుండి రెవెన్యూ గ్రామసభలు

విశాలాంధ్ర - యద్దనపూడి : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 23 నుండి రీ సర్వే జరిగిన గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు నిర్వహి స్తున్నట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. మండ లంలో 23 న గన్నవరం, 24న వింజనంపాడు,25 న జాగర్ల మూడి, 26న యద్దనపూడి, గ్రామా లలో గ్రామ సభలు జరుగుతా యని, రీ సర్వేకు సంబంధించిన సమస్యలపై ప్రజలను అర్జీలు స్వీకరించి, పరిశీలించి, తగు పరిష్కారం చేయనున్నట్లు తెలిపా రు. ఈ అవకాశాన్ని రైతులు సద్విని యోగం చేసుకోవాలని తెలిపారు.

విద్యార్థులకు ఎన్‌సీసీఏ సర్టిఫికెట్లు ప్రధానం

విశాలాంధ్ర - వేటపాలెం : మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పందిళ్లపల్లిలో ఎనిమిది, తొమ్మిది తరగతులు చదువుతున్న బాల, బాలికలలో ఎంపిక చేసిన కొంత మంది రెండు సంవత్సరాలు యన్. సి. సి. శిక్షణ తీసుకోవటం జరిగిందని,అనంతరం వారికి పరీక్షలు నిర్వహించామని ఎన్ఎన్సీ సెకండ్ ఆఫీసర్ తోట వెంకటేశ్వర్లు తెలిపారు. 23(ఏ) బెటాలియన్, చీరాల కమాండింగ్ ఆఫీసర్ సునీల్ గౌతమ్ ఏ సర్టిఫికెట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెడబలిమి శేఖరరావుకు అందచేయగా వారు పరీక్షల్లో ఉత్తీర్ణులై 36 మంది బాల, బాలికలకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు.ఈ సందర్భంగా పాఠశాల యన్.సి.సి. సెకండ్ ఆఫీసర్ తోట. వెంకటేశ్వ ర్లు మాట్లాడుతూ ఉన్నత చదువులయిన ఎంసెట్, నీట్, ఐ.ఐ.ఐ.టి. లాంటి ఉన్నత చదువులలో, ఆర్మీ, పోలీసు లాంటి ఉద్యోగాలలో ఈ సర్టిఫికెట్లు రిజర్వేషన్ గా ఉప యోగపడతాయని, అంతేకాకుండా శారీరకంగా, మానసి కంగా దృఢంగా ఉండి సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని పేర్కొన్నారు.

డిసెంబర్‌లోపు మినీ గోకులాలు నిర్మించుకోవాలి

పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు నాంచారయ్య

విశాలాంధ్ర - రేపల్లె : మినీ గోకులాలు మంజూరైన డిసెంబర్ నెలలోపు షెడ్లు నిర్మించుకోవాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్. బెల్లంకొండ నాంచారయ్య తెలిపారు. రేపల్లె మార్కెట్ యార్డులో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర రెవెన్యూ మంత్రి సోదరుడు అనగాని శివ ప్రసాద్ మాట్లాడుతూ రైతులు మినీ గోకులం నిర్మాణంతప్పనిసరిగా చెయ్యాలని, పాత షెడ్లు చూయించి, కొత్త షెడ్లు నిర్మాణం చేయకుండా బిల్లులు చేయించుకుందాం అనే అపోహలు రైతులు విడనాడాలన్నారు. ఏపీఓలకు కొలతలు ప్రకారం తప్పనిసరిగా షెడ్ నిర్మాణం ఉండే విధంగా ఎక్కడ కూడా నాణ్యత విషయంలో రాజీపడవద్దని సూచించారు. డిసెంబర్ మొదటివారం లోపు నియోజకవర్గంలో మంజూ రైన మినీగోకులం షెడ్లు అన్ని పూర్తి చేయాలన్నారు. మంత్రి సహకారంతో రానున్న రోజుల్లో ప్రతి గ్రామం లో ఎక్కడ చూసిన 20-25 మినీ గోకులములు కనిపించే విధంగా,ప్రతి పాడి రైతుకు మినీ గోకులం వుండే విధం గా ఆలోచిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేపల్లె మండల పశువైద్యాధికారి డాక్టర్. ప్రవీణ్‌కుమార్, నిజాం పట్నం మండలం కూచినపూడి పశు వైద్యులు డాక్టర్ హేమ ప్రియ, నగరం మండలం పూ డివాడ పశువైద్యు లు డాక్టర్ కరీముల్లా, గుత్తావారిపాలెం డాక్టర్ రోషన్ బేగ్, పెదపల్లిగొల్లపాలెం డాక్టర్. జ్యోత్స్న , పశువైద్య సిబ్బంది, టీడీపీనాయకులు తాతా. ఏడుకొండలు మహ త్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకం సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

అర్జీలను వెంటనే పరిష్కరించాలి

రెవెన్యూ డివిజనల్ అధికారి రామలక్ష్మి

విశాలాంధ్ర - రేపల్లె : రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యా లయం నందు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్ర మం జరిగింది. ఆర్డీవో కార్యాల యంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మొత్తం ఆరు అర్జీలు వచ్చాయని రేపల్లె రెవిన్యూ డివిజనల్ అధికారి రామలక్ష్మి తెలి పారు. వేమూరు మండలం ,జంపని గ్రామం కుమ్మరి కుంటలో ఆక్రమ ణలను తొలగించాలని భట్టిప్రోలు మండలం వెల్లటూరుకు చెందిన మైల జయలక్ష్మిరావు, భట్టిప్రోలు మండలం గొరిగపూడి గ్రామ పంచాయితీ చట్ట వ్యతిరేక ఇళ్లస్థలం ఆక్రమణలు .భట్టిప్రోలు మండలం పెద్దలంక స్మశానవాటికను సర్వే చేసి ఇప్పించాలని రేపల్లె మండలం ఉప్పుడి గ్రామంలో ఇళ్ల స్థలమునకు దారి సర్వే చేసి ఇప్పించాలని అధిక ధరలు తగ్గించవలసినదిగా కోరుతూ, ఆదర్శ వేదిక తరపున కన్వీనర్ ఎడ్ల పల్లి కిషోర్ బాబు సభ్యులు మోహ న్‌రావు ,కృష్ణమాచార్యులు, కే వెంకటే శ్వర్లు, జీసాంబశివరావు, కొడాలి ఆనందరావు, అర్జీలు అందజేసినట్లు ఆర్డీవో తెలిపారు.వీటిని ఆయా శాఖల అధికారులకు సత్వరం పరి ష్కార నిమిత్తం పంపడం జరిగిందని ఆర్డీవో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గొడుగులు పంపిణీ

విశాలాంధ్ర-పర్చూరు: కొమర్నేనివారిపాలెంలోని ఎంపి ప్రాధమికోన్నత పాఠశాలలోని 60 మంది విద్యార్థులకు గొడుగులను రోటరీ పూర్వ అధ్యక్షులు నాగభైరు శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో మనుమరాలు జాన్విక ప్రథమ జన్మదినాన్ని పురస్కరించుకొని పంపిణీ చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను కొనసాగించి గ్రామానికి, తల్లిదండ్రులకు పేరు తేవాలని రోటరీ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్ ఆకాంక్షించారు. పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు దాతలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి ఆంజనేయులు, సభ్యులు సదా నందరెడ్డి, పోలిశెట్టి చంద్రశేఖరరావు, సర్పంచ్ మున్నంగి వెంకటసుబ్బయ్య, రోటరీ సిబ్బంది రామకృష్ణ, టీచర్స్ ఉన్నారు.

ఆటోకార్మికులకు ఐడికార్డులు పంపిణీ

విశాలాంధ్ర - అద్దంకి : పట్టణ శ్రీ ప్రసన్నాంజనేయ ఆటో యూని యన్ ఆధ్వర్యంలో సోమవారం ఆటో కార్మికులకు యూ నియన్ ఐడి కార్డులను ఎస్సై ఖాదర్ భాషా పంపిణీ చేశారు. కార్యక్ర మంలో యూనియన్ అధ్యక్షులు నాగిపోగు చక్రవర్తి, కార్యదర్శి బత్తుల చందు, పూసూరి నరేంద్ర , ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఉద్యోగం పేరుతో మోసం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేశారంటూ చీరాల మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన దంపతులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విన తిపత్రం అందజేశారు. బాధితులు అందించిన వివరాల మేరకు కొత్తపాలెం గ్రామానికి చెందిన కావూరి వీరారెడ్డి వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తు న్నానని అదే గ్రామానికి చెందిన బక్కా హరికృష్ణారెడ్డి తన అల్లుడు రాజ మండ్రి సమీపంలోని కందులపాలెం జి.సత్యనారాయణ రెడ్డికి పలుకుబడి ఉందని అక్కడి నాయకులు కొవ్వూరు ద్వారంపూడి సత్య నారాయణ ద్వారా హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తానని రూ. 5 లక్షల అడిగగా అతని మాటలు నమ్మిన వీరారెడ్డి కుమారునికి ఉద్యోగం వస్తుందన్న ఆశతో రాజమండ్రిలోని సత్యనారాయణ రెడ్డికి రూ. పలు దఫాలుగా నగదు చెల్లించామన్నారు. ఉద్యోగం కోసం అడుగుతుంటే వాయిదాలు వేస్తూ వచ్చాడన్నారు. ఉద్యోగం వస్తుందనే నమ్మకం కోల్పోయిన వీరారెడ్డి పెద్ద మనుషులను తీసుకుని హరికృష్ణారెడ్డి వద్దకు వెళ్లి మాట్లాడితే బెదిరింపులకు పాల్పడు తున్నారని తెలిపారు. మోసపోయామని గ్రహించి మాకు ప్రాణరక్షణ కల్పించి మా నగదు తిరిగి ఇప్పించాలని కోరామన్నారు.

ఓరియంటేషన్ శిక్షణ

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండల కేంద్రమైన కొనకన మిట్లలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశంలో సోమ వారం ఎంపీడీవో డి ఈశ్వరమ్మ, ఏపీవో బులెన్నరావుల ఆధ్వ ర్యంలో సోమవారం మండ లంలోని ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు పాత, కొత్త వారికి సీనియర్ మేట్లకు ఉపాధి హామీ పథకం ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రిసోర్స్ పర్సన్ లు,ఏపీ డి నిర్మలాదేవి సిడి పి ఎల్ ఆర్ సి సాంసంగ్, కే అనిల్ కుమార్ ,ఉపాధి హామీ పథకం చట్టం యొక్క ఉద్దేశము, వేతన జీవులపై రాజీలేని అంశాలు, కొలతలు, మాస్టర్ రోలునిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు సీనియర్ మెట్లు పాల్గొన్నారు.

బాపట్లలో వైసీపీ కార్యకర్తల భారీ ర్యాలీ

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : వైసీపీ నూతన జిల్లా అధ్యక్షుడుగా డాక్టర్ మేరుగ నాగార్జున ప్రమాణస్వీకారాన్ని పురస్కరించుకుని పట్టణంలో సోమవారం వైసీపీ క్యాడర్ భారీ ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి నివాసం నుంచి జమ్ములపాలెం రోడ్డులో ఉన్న ఎంఎస్ఆర్ కళ్యాణ మండపం వరకు ర్యాలీగా వెళ్లారు. ర్యాలీతో క్యాడర్‌లో ఉత్తేజం వచ్చింది. మున్సిపల్ అధికారులు పట్టణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఆగమేఘాల మీద తొలగించారని కార్యకర్తలు మండిపడ్డారు. జిల్లా నుంచి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో రావటంతో పండుగ వాతావరణం నెలకొంది.

ప్రియుడి కత్తిపోట్లతో వివాహిత దుర్మరణం

విశాలాంధ్ర - మార్టూరు : ఓ వ్యక్తితో సహజీవనం చేస్తూ చివరికి అతని కత్తిపోట్ల కారణంగా ఓ వివాహిత దుర్మరణం పాలైన సంఘటన మండలంలోని దేగర మూడి గ్రామంలో సోమవారం వెలుగు చూసింది. సీఐ మద్దినేని శేషగిరిరావు,స్థానికులు మేరకు మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన సూరేపల్లి మేరీ (27)కి గతంలో వివాహం కాగా భర్తతో విడిపోయి రాజుపాలెంలోనే తండ్రి నాగరాజుతో కలిసి ఉంటుంది. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో మేరీ కూలి పనుల కోసం కొరిశపాడు మండలం ఎర్రబాలెం గ్రామానికి రెండు సంవత్సరాలు క్రితం వెళ్ళింది. అక్కడ అదే గ్రామానికి చెందిన కందే ప్రసాద్ అనే వ్యక్తితో మేరీకి పరిచయం కాగా ఇద్దరు సహజీవనం చేయసాగారు. ఇటీవల తన తండ్రి నాగరాజు అనారోగ్యానికి గురికావడంతో 20 రోజుల క్రితం మేరీ మార్టూరు మండలం దేగరమూడి గ్రామంలో ఉంటున్న తండ్రి వద్దకు వచ్చి తిరిగి ఎర్రబాలెం వెళ్లలేదు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో దేగరమూడి వచ్చిన కందే ప్రసాద్ మేరీతో ఘర్షణ పడి క్షణికావేశంతో కత్తితో మేరీ మెడ పై బలంగా పొడవగా తీవ్ర రక్తస్రావం అయింది. ప్రసాద్ తిరిగి కత్తితో పొడవుగా మేరీ రెండు చేతులు అడ్డుపెట్టడంతో చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న మేరీని స్థానికులు 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న మేరీ పరిస్థితి విషమించడంతో సోమవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు సీఐ తెలిపారు. మేరీ మృతదేహానికి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలోనే శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు సిఐ తెలిపారు. మేరీ మృతికి కారణమైన కందే ప్రసాద్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్

విశాలాంధ్ర - బాపట్ల : ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు.సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం స్థానిక కలెక్టరేట్ లో సోమవారం జరిగింది. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి ప్రజలు కలెక్టరేట్ కు చేరుకుని వినతి పత్రాల ద్వారా సమస్యలు విన్నవించారు. నమోదైన అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలన్నారు. పాత గుంటూరు జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎన్నికలు ఉన్నందున ఓటర్ల నమోదు ప్రక్రియ వేగంగా చేపట్టాలన్నారు. అనంతరం అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా నగదు బహుమతి పంపిణీ చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, ఆర్డీవో పి గ్లోరియా, ఉప కలెక్టర్ లక్ష్మీకుమారి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మా ప్రాంతంలో మద్యం దుకాణం పెట్టొద్దు

ఈపురుపాలెం గ్రామ ముస్లింలు ఆందోళన

విశాలాంధ్ర - చీరాల, చీరాల రూరల్ : గుడులు,బడులు, మసీదులు ఉండే ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని ముస్లిం సోదరులు అన్నారు.మాకొద్దు మద్యం దుకాణం అంటూ ఈపురుపాలెం గ్రామ ముస్లిం సోదరులు సోమవారం ఆందోళన చేశారు. ఈపురుపాలెం, తోటవారిపాలెం ప్రధాన రహదారిలో మసీదు వద్ద మద్యం దుకాణం ఏర్పాటు చేసేందుకు సన్నాహాకాలు జరుగుతున్నాయని,ఇటువైపు మసీదు,అటువైపు చర్చిలు ఉన్నాయని ఈ ప్రధాన రహదారిలో నిత్యం విద్యార్థిని విద్యార్థులు కళాశాలలకు కాలి నడకన వెళ్లి వస్తుంటారని ఇటువంటి ప్రదేశాలలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తే మహిళలు ప్రజలు మందు బాబులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు.మసీదు,చర్చిలు ఉన్న ఈ ప్రధాన రహదారిలోని మద్యం దుకాణాలు తక్షణమే తొలగించాలని కోరారు.ఊరికి దూరంగా మద్యం దుకాణాల యజమానులు షాపు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో జరిగే అనర్థాలకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఊరికి దూరంగా ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తోటవారిపాలెం కుందేరు బ్రిడ్జికి ఇటువైపు మసీదు పక్కన అటువైపు చర్చి పక్కన మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారని,వీటిని తక్షణమే తొలగించాలని ప్రజలు డిమాండ్ చేశారు.తోటవారిపాలెం ప్రధాన రహదారిలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయకుండా అధికారులు, నాయకులు తక్షణమే స్పందించి మద్యం దుకాణం ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.అనంతరం చీరాల పట్టణంలో ర్యాలీ నిర్వహించి చీరాల మండల తహసీల్దార్ గోపి కృష్ణ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గోపి కృష్ణ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా మద్యం దుకాణాలు ఏర్పాటు చేసేలా సమస్యను బాపట్ల జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.అనంతరం జిల్లా కలెక్టరుకు వినతి పత్రం సమర్పించేందుకు వెళ్ళారు. ఈ కార్యక్రమంలో ఈపురుపాలెం టీడీపీ నాయకులు పఠాన్ గౌస్ ,బాపట్ల జిల్లా టీడీపీ మైనారిటీ సెల్ కార్యదర్శి సయ్యద్ ముతహర్,మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ మస్తాన్,దళిత బహుజన పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు షేక్ జిలానీ,ముస్లిం నాయకులు షేక్ నూర్ మహ్మద్,షేక్ కరిముల్లా,షేక్ మునఫ్,షేక్ సుభాని, మహిళలు పాల్గొన్నారు.

లక్ష్మి సుకన్యను తక్షణమే అరెస్టు చేయాలి

- బహుజన గిరిజన రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుబ్బారావు

విశాలాంధ్ర - చీరాల : గంటా శేఖర్ బలవన్మరణం కేసులో లక్ష్మి సుకన్యను తక్షణమే అరెస్టు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని బహుజన గిరిజన రాష్ట్ర అధ్యక్షులు గంటా సుబ్బారావు అన్నారు.సోమవారం చీరాల దళిత మహా సభ కార్యాలయంలో పోలీసుల ఉదాసీనత వైఖరిపై విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మాచవరపు జూలియన్, బహుజన గిరిజన రాష్ట్ర అధ్యక్షులు గంటా సుబ్బారావులు మాట్లాడుతూ ఎస్టీ కులానికి చెందిన గంటా శేఖర్ బలవన్మరణం కేసులో లక్ష్మి సుఖన్యను అరెస్టు చెయ్యాలన్నారు.వేటపాలెం మండలం వినాయకపురంలో లక్ష్మీ సుకన్య అను ఇతర కులానికి చెందిన మహిళ ఎస్టీ కులానికి చెందిన గంటా శేఖర్ తో వివాహేతర సంబంధం పెట్టుకొని అతని బలవన్మరణానికి కారణమైందన్నారు. అక్టోబర్ మూడవ తేదీన బలిజ కులానికి చెందిన గంట శేఖరును కులం పేరుతో దూషించి రాయితో కొట్టి తన భార్య వాణి ని వదిలేసి తనతోనే కాపురం చేయాలని శేఖర్ ను బెదిరించటంతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. గంటా శేఖర్ వేటపాలెం మండలం వినాయకపురం గ్రామానికి చెందినవాడని, నెల్లూరు జిల్లా గూడూరుకు చెందిన వాణిని 16 ఏళ్ల క్రితం పెళ్లి చేసుకున్నాడని వారికి పిల్లలు లేరని తెలిపారు. ఈ కేసులో ఐపీసీ 306 ఎస్సీ ఎస్టీ ఆక్ట్ వేయాలని వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లును శేఖర్ భార్య బంధువులతో కలిసి దళిత నాయకులు నీలం నాగేంద్రరావు ఎస్ఐతో మాట్లాడారని,పోస్టుమార్టం రిపోర్టు రాగానే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఉన్నతాధికారులు ఈ కేసులో జోక్యం చేసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కేసును నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్న వేటపాలెం పోలీసులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబానికి ప్రభుత్వం చేసే న్యాయమని తక్షణమే చిత్తశుద్ధితో లక్ష్మి సుఖన్యాను అరెస్టు చెయ్యాలని డిమాండ్ చేశారు. మాల మహానాడు బాపట్ల జిల్లా అధ్యక్షులు దార అంజయ్య ,బహుజన గిరిజన ఐక్య వేదిక బాపట్ల జిల్లా అధ్యక్షులు దేవరకొండ కోటేశ్వరరావు,దళిత మహా సభ జిల్లా అధ్యక్షులు మేరిగ రమేష్ బాబు,గంటా ఏసుదాసు,బాధిత మహిళ గంట వాణి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అద్దంకమ్మ 14వ వార్షికోత్సవం

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలోని పాత చీరాల గ్రామంలో వేంచేసి ఉన్నటువంటి శ్రీ అద్దంకమ్మ అమ్మవారి 14వ వార్షికోత్సవ సందర్భంగా దేవ వంశస్థులు నాలుగు రోజుల పాటు నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు సోమవారంతో ముగిశాయి. శనివారం చీరాల డి.ఎస్.పి జగదీష్ నాయక్ చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఆదివారం ఉదయం ఇంటింటా పొంగళ్ళు ఊరంతా పొంగళ్ళు కార్యక్రమం జరిగింది. పూజా కార్యక్రమాలు సోమవారంతో ముగిశాయి.

సజ్జ పంట పరిశీలన

విశాలాంధ్ర-బేస్తవారిపేట : మండలంలోని గలిజేరుగుళ్ళ గ్రామంలో కోత దశలో ఉన్న సజ్జ పంటను మండల వ్యవసాయాధికారిణి జక్కం మెర్సీ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తుఫాన్ కారణంగా 125 హెక్టార్ల మేర సజ్జ పంట నష్టం జరిగినట్లు అంచనా వేసి ప్రాథమిక నివేదికను పై అధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని తెలిపారు. రైతులు పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా నీటిని బయటకి వెళ్లేలా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి షేక్ కాశింషా, రైతు సేవా కేంద్ర సిబ్బంది పఠాన్ మహబూబ్ సుభానీ, రైతులు పాల్గొన్నారు.

పురపాలక సంఘం కార్యాలయము - రేపల్లె

బహిరంగ వేలము నోటీసు

RocNo: 158/2022/A2 Dt : 21-10-2024

రేపల్లె పురపాలక సంఘం యాజమాన్యమునకు చెందిన వివిధ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లకు సంబంధించి 25 సంవత్సరములు లీజు కాలపరిమితి పూర్తి అయిన షాపు రూములను లీజుకిచ్చుటకు గాను ది.25-10-2024 తేదిన శ్రీయుత కమీషనరు గారిచే గాని/ వారి అనుమతి పొందిన వారిచే గాని 2024-2025 గెజిట్ నోటిఫికేషన్ షరతుల మేరకు బహిరంగ వేలము నిర్వహించబడును. కావున పాటలో పాల్గొనువారు ఎస్.సి, ఎస్.టి. షాపులకు సంబంధించి కుల ధృవీకరణ పత్రముతో పాటలో పాల్గొనవలయును. ఇతర వివరములు ఈ కార్యాలయము పనివేయు వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.

కమీషనర్
రేపల్లె పురపాలక సంఘము

జడ్పీకి పూర్వ వైభవం వచ్చేనా ...

◆నేడు జడ్పీ సమావేశం
◆దూరంగా ఉంటున్న అధికార పక్షం ఎమ్మెల్యేలు, ఎంపీ
◆ప్రస్తుత వైసీపీ గుప్పెట్లోనే జడ్పీ
◆సమస్యలపై చర్చించి తీర్మానాలు చేసేందుకు ఒక వేదిక
◆ సమావేశాలు రాజకీయ అంశాలతో తగ్గుతున్న ప్రాధాన్యత
◆సభ్యులు సమావేశంలో పాల్గొనాలని చైర్మన్ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం. ఈ సమావేశానికి గతంలో ఎంతో ప్రాధాన్యత ఉండేది. మూడు నెలలకు ఒకసారి జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, జిల్లాలో నెలకొన్న ప్రధాన సమస్యలు, జిల్లాకు అవసరమైన సంక్షేమంపై ఈ సమావేశంలో చర్చించేవారు. జిల్లాకు సంబంధించిన అనేక అభివృద్ధిపై తీర్మానాలు చేసి ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చి తద్వారా ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టుకొని జిల్లా సమగ్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషించేది జడ్పీ సమావేశాలు. మండల స్థాయిలో జడ్పీటీసీలు, ఎంపీపీలు ఈ సమావేశంలో పాల్గొనేవారు. ముఖ్యంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి జిల్లాకు చెందిన మంత్రులు, జిల్లా పరిషత్ చైర్మన్, కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు అందరూ ఈ సమావేశంలో పాల్గొని సమావేశంపై చర్చించే ఒక చక్కటి వేదిక. 2004 ముందు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు దగ్గర నుంచి 2004 తరువాత దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోను జడ్పీ సమావేశాలకు ప్రాధాన్యతను కల్పించేవారు. ఈ సమావేశంలో మండలస్థాయి ప్రజా ప్రతినిధుల దగ్గర నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, కలెక్టర్ అన్ని శాఖల అధికారులు పాల్గొని ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఆరేడు గంటల వరకు నిర్వహించి అనేక సమస్యలపై చర్చించి జిల్లా సమగ్ర అభివృద్ధిపై అనేక తీర్మానాలు చేసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చేవారు. తద్వారా ఇన్‌ఛార్జి మంత్రులు జిల్లాకు అవసరమైన నిధులను రాబట్టి జిల్లా అభివృద్ధిలో కీలకంగా ఈ సమావేశం ఉండేది. అలాంటి ఈ సమావేశాలు గత ఐదు సంవత్సరాలుగా పక్కదారి పట్టాయి. రాజకీయ కక్షలు, కార్పణ్యాలతో ప్రజా ప్రతినిధులు సమావేశాలకు గైర్హాజరవుతున్నారు. ప్రస్తుతం జిల్లా పరిషత్ చైర్మన్ పీఠం వైసీపీ గుప్పెట్లో ఉంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 56 మండలాల్లో అత్యధిక మండలాల్లో జడ్పీటీసీలు, వైసీపీవారు గెలవడంతో ఆ పార్టీకి చెందిన బూచేపల్లి వెంకాయమ్మను జడ్పీ చైర్మన్‌గా చేశారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు జడ్పీ సమావేశానికి అప్పటి వైసీపీ ఎమ్మెల్యేలు హాజరయ్యేవారు. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. జిల్లాలో వైసీపీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు ఉండగా మిగిలినవారు తెలుగుదేశం పార్టీకి చెందిన వారు ఉన్నారు. జిల్లాకు సంబంధించి కొండెపి ఎమ్మెల్యే బాల వీరాంజనేయస్వామి మంత్రిగా ఉన్నారు. ఒంగోలు ఎంపీ కూడా తెలుగుదేశం పార్టీ చెందిన మాగుంట శ్రీనివాసరెడ్డి ఉన్నారు. అయితే నేడు జరిగే జడ్పీ సమావేశానికి తెలుగుదేశం పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు గైర్హాజరయ్యే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. జడ్పీ చైర్మన్ వైసీపీకి చెందిన బూచేపల్లి వెంకాయమ్మ ఉండటం, జిల్లాలో అత్యధికంగా ఎంపీపీలు, జడ్పీటీసీలు వైసీపీకి చెందిన వారు ఉండటం వలన ఆ సమావేశానికి పాల్గొనడానికి తెలుగుదేశం పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ఆసక్తి చూపడం లేదు. రానున్న రోజుల్లో జడ్పీ పీఠాన్ని కూడా తెలుగుదేశం కైవసం చేసుకునేందుకు గత కొన్ని రోజుల నుంచి ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఒంగోలు కార్పొరేషన్ వైసీపీ గుప్పెట్లో ఉండగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైసీపీకి చెందిన 20 మంది కార్పొరేటర్లను తెలుగుదేశం పార్టీలోకి చేర్చుకొని ఒంగోలు చైర్మన్ పీఠాన్ని తెలుగుదేశం కైవసం చేసుకుంది. అదే విధంగా జిల్లాలో కొన్ని మునిసిపాలిటీల్లో అధికారంలో ఉన్న వైసీపీ కౌన్సిలర్లను కూడా తెలుగుదేశం వైపు చేరుతున్నారు. అదే విధంగా మండలస్థాయిలో సర్పంచులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు కూడా తెలుగుదేశం పార్టీ వైపు మలుచుకునేందుకు కొత్తగా గెలిచిన తెలుగుదేశం పార్టీ ముమ్మరం చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఒంగోలులో జరిగే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులందరూ దూరమవుతున్నట్లు తెలుస్తుంది. దీనివల్లకు జిల్లాకు నష్టం తప్ప ఏ మాత్రం ప్రయోజనం లేదు. ప్రస్తుతం ప్రకాశం జిల్లాలో గత వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు 4500 హెక్టార్లలో వివిధ రకాల పంటలకు నష్టం జరిగింది. రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నేటికీ పశ్చిమ ప్రాంతంలో తాగునీటి సమస్య తాండవిస్తుంది. పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి నిర్వాసితుల సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. గతంలో ప్రాజెక్టు టన్నెల్ పూర్తి కాకుండానే అప్పటి ముఖ్యమంత్రి ప్రారంభించారు. ప్రాజెక్టుకు సంబంధించి అనేక పనులు పెండింగ్‌లో ఉన్నాయి. తక్షణం వెయ్యి కోట్లు నిధులు అవసరం ఆ ప్రాజెక్టు పూర్తయితేనే పశ్చిమ ప్రాంతంలో తాగు, సాగునీటి సమస్య పరిష్కారం అవుతుంది. మరోపక్క జిల్లాలో రోడ్డు, తాగునీటి ప్రాజెక్టులు, యూనివర్సిటీ, తాగునీటి సమస్య, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం నేటికీ ప్రజలకు పూర్తిస్థాయిలో అందడం లేదు. ఇలాంటి సమయంలో జిల్లా సర్వసభ్య సమావేశం ఒక వేదిక. జిల్లా ప్రజా ప్రతినిధులు ఒక వేదికగా ఉపయోగించుకొని సమిష్టిగా జిల్లాకు అవసరమైన నిధులను ఏపీ శాఖలకు ఎంత అవసరమో అధికారుల చేత అంచనాతో అందరూ కలిసికట్టుగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఆ నిధులు రాబట్టి జిల్లా అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాల్సిన ఇలాంటి సమావేశాలు రాజకీయాలకు అతీతంగా ప్రజా ప్రతినిధులు పాల్గొని చర్చించాల్సిన సమావేశాలకు అందరూ హాజరు కావాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరగనుంది.

రాష్ట్రంలో రాక్షస పాలన:మేరుగ

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందని నాలుగు నెలలకే కూటమి ప్రభుత్వంపై ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారని వైస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున మండిపడ్డారు. స్థానిక ఎమ్మెస్సార్ కళ్యాణ మండపంలో సోమవారం జరిగిన సభలో జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం జరిగిన సభలో నాగార్జున మాట్లాడుతూ కార్యకర్తలకు వెన్నంటే నేనుంటానని ఎవరూ కూడా నిరుత్సాహం చెందకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎత్తి చూపి ప్రజలకు వివరించేందుకు వెనకడుగు వేయొద్దన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నియంతృత్వ పోకడలతో పాలన సాగిస్తుందన్నారు. శాసనమండలి సభ్యులు లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ పార్టీ ఓడిపోతే మూడేళ్ళు వరకు ప్రజలకు కనిపించకుండా తిరిగే ఈరోజుల్లో అధికారంలో లేకున్నా ప్రజలే కావాలని ప్రజల్లో ఉంటున్న ఏకైక నాయకుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాత్రమే అని పేర్కొన్నారు. సూపర్ సిక్స్‌లో

కనీసం ఒక్క సిక్స్ కూడా కొట్టలేకపోయ్యారని దుయ్యబట్టారు. పార్టీకోసం కష్టపడి పని చేయాలని కోరారు. ప్రతి కార్యకర్తలకు అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ ప్రకాశం జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి తెలిపారు. దాడులకు పాల్పడే టీడీపీ నాయకులు ప్రజాకోర్టులో త్వరలో మూల్యం చెల్లించుకోవాల్సివస్తోందని హెచ్చరించారు. జమిలి ఎన్నికలకు అందరు సిద్దంగా ఉండాలని సూచించారు. సంక్షేమ పథకాలు అమలు చేయటంలో వైఎస్ జగన్మోహనరెడ్డి చేసినట్లు ఎవరూ చేయలేని విషయాన్ని దేశ ప్రజలు సైతం గుర్తించి చర్చించుకుంటున్నారని జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. కరోనా వంటి విపత్తులో కూడా ప్రజలకు 'మెరుగైన వైద్యసేవలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కిందని ఆమె తెలిపారు. జమిలి ఎన్నికలకు ప్రజలకు సిద్ధంగా ఉండాలని అదరక బెదరక పోరాటం చేద్దామని మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి తెలిపారు. రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల మాట్లాడుతూ రాష్ట్రంలో సనాతన ధర్మం పేరుతో మత రాజకీయాలు చేస్తున్నారని ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజల్లో అల్లకల్లోలం సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గాదె మధుసూదనరెడ్డి, అద్దంకి ఇంచార్జీ హనిమిరెడ్డి ,బత్తుల బ్రహ్మానందరెడ్డి, బాపట్ల పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు, మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, కొక్కిలిగడ్డ చెంచయ్య,జోగి రాజా తదితరులున్నారు.

కొత్తపట్నం ఎంపీడీసీపై మహిళా వైద్యుల ఫిర్యాదు

ముగ్గురు కమిటీ సభ్యులతో కమిటీ ఏర్పాటు :కలెక్టర్ తమీమ్ అన్సారియా

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : కొత్త పట్నం సర్వసభ్య సమావేశంలో ఆ మండల వైద్యాధికారిణి వైష్ణవిపై అసభ్య పదజాలం ఉపయోగించి దురుసుగా వ్యవహరించిన ఎంపీటీసీ రామలింగం వెంకట రావుపై ఆ మండల వైద్యాధికారిణి వైష్ణవి ఇతర మహిళా వైద్యులతో కలిసి వెళ్లి స్పందనలో ఫిర్యాదు చేసారు. తక్షణమే స్పందించిన జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ముగ్గురు సభ్యులతో

కూడిన కమిటిని వేసి విచారణకు ఆదేశించారు. మహిళా డాక్టర్‌ను అసభ్య పద జాలంతో దూషించటాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రాధమిక వైద్యుల సంఘంజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాహుల్, డాక్టర్ షేక్ ఖాదర్ మస్తాన్ బిలు తీవ్రంగా ఖండించారు. ఇటువంటి సంఘటనలు మహిళా వైద్యుల ఆత్మాభిమాన్ని దెబ్బతీస్తాయని, సంఘటనలు ఉపేక్షించరాదని ఇన్చార్జి జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శ్రావణ్ కుమార్, జిల్లా ఆరోగ్య శ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ హేమంత్ అన్నారు. సంఘటనను జిల్లా వైద్యులు ఖండించారు. సంఘటనపై తక్షణమే స్పందించిన జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వైద్యుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలను సహేతుకంగా

పరిష్కరించాలి: కలెక్టర్

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రజా సమస్యల పరిష్కారవేదిక 'మీకోసం' కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని సీరియస్‌గా పరిగణనలోకి తీసుకొని సకాలంలో సహేతుకంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పునరుద్ఘాటించారు. సోమవారం ప్రకాశం భవనంలో నిర్వహించిన 'మీకోసం' కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాల కృష్ణతో కలిసి ప్రజల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 249 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'మీకోసం' కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో అర్జీలను పరిష్కరిస్తున్న తీరును ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అధికారులు పర్యవేక్షిస్తున్నారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ. శ్రీమతి. ఆర్.శ్రీలం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మాధురి, ఝాన్సీ లక్ష్మీ, అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణ పోలీసుల ధ్యేయం

విశాలాంధ్ర-కొండపి : సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ పోలీసుల ధ్యేయమని కొండపి సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్ కుమార్ అన్నారు. పోలీసుల అమర వీరుల దినోత్సవం సందర్భంగా కొండపిలో పోలీసులు సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుండి ఎమ్మార్వో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ,అనంతరం ఎన్టీఆర్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. మరిపూడి ఎస్సై రమేష్ , పొన్నలూరు ఎస్సై అను, కొండపి ఏ ఎస్ఐ ఎస్ అంకారావు, పొన్నలూరు ఏఎస్ఐ హఫీజ్, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ ఓటు వేస్తే దాడులా: సర్పంచ్ నాని

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : కర్లపాలెం మండలం పెద్ద గొల్లపాలెం పంచాయతీ ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ కారు డ్రైవర్‌నంటూ అధికార పార్టీ అండ దండలతో వైసీపీకి ఓట్లు వేసిన వారిపై దాడులు చేస్తున్నారని గొల్లపాలెం సర్పంచ్ ఎల్లవుల సురేష్ పేర్కొన్నారు. అధికార పార్టీ మాది అంటూ గ్రామంలో వివాదాలు సృష్టిస్తూ వైసిపి పార్టీకి ఓట్లు వేసిన పాపానికి తమపై దాడులు చేస్తూ తీవ్రంగా గాయపరుస్తున్నారని తెలిపారు. ఒక వ్యక్తిని హత్య చేయదానికి కారులో తీసుకెళుతున్న క్రమంలో తాము వెంటపడి కారు వెనకే వెళ్లగా క్షతగాత్రుని కర్లపాలెం పోలీస్ స్టేషన్ వద్ద దించి దాడి చేసిన వారే బాపట్ల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతూ తమపై తప్పుడు కేసులు పెడుతున్నారంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులుకరిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కార్యకర్తపై దాడులు సహించం: కోన

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల ఏరియా వైద్యశాలలో టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన చికిత్స పొందుతున్న కర్లపాలెం మండలం పెదగొల్లపాలెం గ్రామానికి చెందిన యువకుడిని వైసీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేరగ నాగార్జున, బాపట్ల మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి పరామర్శించారు. పెద్దగొల్లపాలెం గ్రామంలో జరిగిన సంఘటనలో బాధితులకు అండగా ఉంటానని బాధితులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కాగిత సుధీర్ బాబు, మండల పార్టీ అధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు జోగి రాజా తదితరులు ఉన్నారు.

ఉచిత న్యాయ సహాయం

విశాలాంధ్ర - రేపల్లె : జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో అందరికీ అందుబాటులో ఉచిత న్యాయం పొందేందుకు 15100నెంబర్‌కు డయల్ చేసి ఉచిత న్యాయం పొందవచ్చునని అహ్మదీయ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ రేపల్లె మండలం కోర్టు పారా లీగల్ వాలంటీర్ సయ్యద్ తాహిర్ అహ్మద్ అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ రూపొందించిన స్టిక్కర్లను పెద్ద పోస్ట్ ఆఫీస్, ఆర్టీసీ బస్టాండ్, ప్రభుత్వ ఉన్నత హైస్కూల్, గోడలపై స్టిక్కర్లు అంటించి ప్రచారం నిర్వ హించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయానికై 15100కు ఫోన్ చేసి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్ను నాగమల్లేశ్వరరావు, ఆర్ శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగంపై శిక్షణ

విశాలాంధ్ర - రేపల్లె : పంటకోత ప్రయోగం వలన ఒక ఎకరం పంటలో సరాసరి దిగుబడిని ముందుగానే అంచనా వేయవచ్చునని రేపల్లె మండల వ్యవసాయ శాఖ అధికారి ఆర్ విజయ్ బాబు అన్నారు. సోమవారం రేపల్లె మండలంలోని రేపల్లె అర్బన్ రైతు సేవా కేంద్రం నందు పంట కోత ప్రయోగ పై మండల స్థాయిశిక్షణతరగతులునిర్వహించినట్లు ఆయన తెలిపారు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కోత ప్రయోగం వలన సెలెక్ట్ చేయవలసిన సర్వే నెంబర్లు రాండం నెంబర్లు ఆధారంగా సర్వే నంబర్లు సెలెక్ట్ చేయడం, ఫారం వన్ టు పూర్తి చేసే విధానం ఆన్‌లైన్ యాప్ ద్వారా పంట కోత నిర్వహణ రిపోర్టును నమోదు చేసే విధానం గురించి వివరించారు. అదేవిధంగా ఎలుకల మందు పంపిణీ కార్యక్రమం ఈనెల 23వ తేదీ బుధవారం నాడు జరుగుతుందని రైతులు నూకలు, నూనె రైతు సేవ కేంద్రం వద్దకు తెచ్చుకోవాలని విలేజి అగ్రికల్చరల్ అసిస్టెంట్ల ఎలుకల మందు కలిపి రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి కోరారు. ఏఈఓ కె. నాగ శ్రీనివాసరావు, విఏఏలు ఎంపీఈవోలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓట్ల నమోదులో చురుకైన పాత్ర పోషించాలి

టీడీపీ శ్రేణులను కోరిన ఎమ్మెల్యే ఆనందబాబు

విశాలాంధ్ర - వేమూరు : పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి ఓటర్ల నమోదు కార్యక్రమంలో పార్టీ శ్రేణులు చురుకైన పాత్ర పోషించాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు విజ్ఞప్తి చేశారు .సోమవారం సాయంత్రం వేమూరులో నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం స్థానిక లక్ష్మీ గణపతి కళ్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కృష్ణ-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం స్థానం నుండి అలపాటి రాజేంద్రప్రసాద్ పోటీ చేయుచున్నందున ప్రతి కార్యకర్త పట్టభద్రులను ఓటరుగా చేర్చే బాధ్యత తీసుకోవాలన్నారు. పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకునే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అందుకు సంబంధించి ఇప్పటికే పార్టీ నాయకులకు ఓటర్ నమోదు అప్లికేషన్ చేరాయి అన్నారు. గ్రామాల్లో నాయకులు పట్టభద్రులను గుర్తించి ఓటర్లుగా చేర్పించాలని చేర్పించటమే కాకుండా ఆ ఓట్లను తమ పార్టీకి చేరేంతవరకు చురుకుగా పని చేయాల్సి ఉంటుందన్నారు. అదేవిధంగా ఈనెల 26వ తేదీ నుంచి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందని దీనిపై దృష్టి సారించి గత ఎన్నికల్లో పనిచేసిన మాదిరిగా చిత్తశుద్ధితో పనిచేసే పార్టీ ప్రతిష్ట పెంచే విధంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదు తీసుకున్న ప్రతి కార్యకర్తకు ప్రమాదం సంభవిస్తే ఐదు లక్షల ఇన్సూరెన్స్ తో పాటు పార్టీ పరంగా పదివేలు అందించేందుకు పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. ఓటర్ నమోదు కొరకు ప్రత్యేక టీమ్ లో ఏర్పాటు చేయడం జరిగిందని వారు గ్రామాల్లో నాయకులను దగ్గర పెట్టుకుని సభ్యత్వ నమోదు ప్రక్రియ పూర్తి చేస్తారని తెలిపారు. సమావేశంలోమార్కెట్ యార్డు మాజీ చైర్మన్ జొన్నలగడ్డ విజయబాబు, డాక్టర్ కనగాల మధుసూదన్ ప్రసాద్, తూ నుగుంట్ల సాయిబాబా, ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు దండే సుబ్బారావు, వాక శేషుబాబు, మైనేని మురళీకృష్ణ, విఎస్‌కే ప్రసాద్, శివా రెడ్డి, అమ్మిశెట్టి కిషోర్, వేమూరు మురళీకృష్ణ, షేక్ హనీఫ్, గోపాలం సుబ్బారావు, మన్నే పసి, వేల్పుల రవి , దాది లక్ష్మణరావు, ఉక్కుర్తి నాగేశ్వరరావు, కంచి సీతారామయ్య,పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్‌లో

విజిలెన్స్ అధికారులు తనిఖీలు

- సీల్ వేయని కాటాలు, తెల్ల కాగితాలే బిల్లులు
- కమిషన్ తీసుకుంటున్నారని రైతులు వెల్లడి

విశాలాంధ్ర - మార్టూరు : మండల కేంద్రం మార్టూరు జాతీయ రహదారి పక్కన గల కూరగాయల మార్కెట్ మార్కెటింగ్ విజిలెన్స్ శాఖ అధికారులు సోమవారం మధ్యాహ్నం వరకు తనిఖీలు నిర్వహించారు. కమిషన్ వ్యాపారులు రైతులను స్వయంగా విచారించారు. విచారణలో భాగంగా మార్కెట్‌లో రైతులకు జరుగుతున్న అన్యాయం అక్రమాల డొల్లతనం వెల్లడవడం గమనార్హం. మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సువర్చల కమిషన్ వ్యాపారుల కాటాలకు సీలు వేయని పరిస్థితిని గమనించి ప్రశ్నించారు. రైతులు తాము వ్యాపారులకు విక్రయించిన కూరగాయలపై 8 శాతం కమిషన్ మినహాయించుకొని తమకు వ్యాపారులు నగదు చెల్లిస్తున్నట్లు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. తూకంలో తారం పేరుతో రెండు నుండి నాలుగు కిలోల బరువును ప్రతి బస్తాకు తూకంలో తగ్గిస్తున్నట్లు రైతులు ఆమెకు తెలిపారు. రైతులతో సువర్చల మాట్లాడే సమయంలో సిండికేట్‌గా ఏర్పడి మార్కెట్లో అరాచకాలు సృష్టిస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు ఆమెతో ఉండటం విమర్శలకు దారితీసింది. తమ వద్ద కూరగాయలు కొనుగోలు చేసే కమిషన్ వ్యాపారులు అధికారులు చుట్టూ ఉండటం వలన తాము ఆమెకు వాస్తవాలు చెప్పలేకపోయామని విలేకరుల ముందు రైతులు వాపోవటం గమనార్హం. విచారణ సమయంలో విలేకరులపై వ్యాపారుల దౌర్జన్యం చేయటం కొసమెరుపు. లైసెన్స్ కలిగిన కమిషన్ వ్యాపారులు రైతుల నుండి కొనుగోలు చేసిన సరుకు కు అవసరమైన బిల్లులను తమ ఫరం పేరుతో ఉన్న లెటర్ ప్యాడ్ పై కాకుండా తెల్ల కాగితాలపై వివరాలు రాసి ఇవ్వటాన్ని గమనించిన డిడి సువర్చల ఇదేమిటి అని ప్రశ్నించగా వ్యాపారాల నుండి ఎలాంటి సమాధానం రాకపోవడం గమనార్హం. తనిఖీ అనంతరం విలేకరులతో మాట్లాడిన డిప్యూటీ డైరెక్టర్ సువర్చల రైతుల నుండి వివరాలు సేకరించామని తోకంలో బస్తాకు నాలుగు కిలోల వరకు తారం పేరుతో తగ్గించటం ఎనిమిది శాతం కమిషన్ తీసుకొని వారం రోజుల్లో రైతులకు పేమెంట్ ఇస్తున్నట్లు రైతులకు ఇవ్వవలసిన అధికారిక రసీదులకు బదులు తెల్ల కాగితాలు వినియోగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు ఆమె తెలిపారు. కొంతమంది వ్యాపారులు ఎలక్ట్రానిక్ కాటాలకు సీలు లేకుండా రైతులు కూరగాయలు కాటా వేస్తున్నట్లు ప్రత్యక్షంగా గమనించానని సమస్యను నివేదిక రూపంలో రీజనల్ జాయింట్ డైరెక్టర్ మార్కెటింగ్ ఝాన్సీ రాణికి పంపించి తగు చర్యలు తీసుకోనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో పొదిలి ఏఎంసీ కార్యదర్శి రవిశంకర్ రెడ్డి,దరిసి ఏఎంసీ కార్యదర్శి పి పద్మ శేఖర్, చీరాల ఏఎంసి సీనియర్ అసిస్టెంట్ జి ప్రసాద్ పర్చూరు ఏ ఏం సి కార్యదర్శి పాల్గొన్నారు.

పోలీసు అమర వీరులకు ఘన నివాళులు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : పోలీసు అమర వీరుల దినోత్సవం సందర్భంగా బాపట్ల పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు జిల్లా తాండ్ర సాంబశివరావు, మాజీ సైనికులతో కలిసి పాల్గొని అమర వీరులకు ఘనంగా నివాళులు జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1959 వ సంవత్సరంలో అక్టోబర్ 21 వ తేదీన చైనా బోర్డర్ లో దేశం కోసం ప్రాణాలు అర్పించిన పోలీసు వీరుల గౌరవార్థం, దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమర వీరుల త్యాగాలను స్మరించుకుంటారన్నారు. ఎస్పీ తుషార్ డూడి నేతృత్వంలో శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మరాజు సమక్షంలో పోలీసు అమర వీరుల దినోత్సవం వేడుకలు జరుపుకోవడం సంతోషదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల అసోసియేషన్ ఉపాధ్యక్షులు పుట్టా ఆది శేష రెడ్డి, ఉమ్మడి గుంటూరు జిల్లా కో ఆర్డినేషన్ కమిటీ అధ్యక్షులు సుంకర శేషగిరి రావు, సీనియర్ మాజీ సైనికులు తోట దుర్గా రావు, ఏమినేని సురేంద్ర, కొండమూది సుబ్బారావు, డి వెంకటేశ్వర్లు, రుక్మధర రావు, పి రాధాకృష్ణ మూర్తి, కె రాజేష్ నాయుడు, పసుపులేటి ప్రసాద్ మొదలగు మాజీ సైనికులు పాల్గొన్నారు.

సబ్సిడీపై యూరియా పంపిణీ

విశాలాంధ్ర-రాచర్ల : మండలంలోని రాచర్ల 1, రాచర్ల 2, ఆరవేటి కోట, ఆకవీడు మరియు అనుమలవీడు రైతు సేవా కేంద్రాలలో యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయ అధికారి షేక్. అబ్దుల్ రఫీక్ తెలిపారు. కావలసి నటువంటి రైతులు ఆధార్ కార్డు జిరాక్స్ మరియు పాస్ పుస్తకం జిరాక్స్ తీసుకొని ఆయా రైతు సేవ కేంద్రాలలో సంప్రదించ వలసిందిగా తెలిపారు, 45 కేజీల యూరియా బస్తా రైతు కట్టవలసింది 266.50 రూపాయలు మాత్రమేనని తెలిపారు.

ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం:ఎస్పీ తుషార్ డూడి

విశాలాంధ్ర - బాపట్ల : ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని జిల్లా ఎస్పీ తుషార్ డూడి పోలీస్ అధికారులను హెచ్చరించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. ప్రజా సమస్యలను విని, అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ చేసి చట్ట పరిధిలో విచారించి త్వరితగతన అర్జీలను పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. భువివాదాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక లావాదేవీల మోసాలు వంటి పలు సమస్యలపై 39 మంది ఫిర్యాదుదారులు వారి సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను చట్ట పరిధిలో త్వరితగతిన విచారించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరిస్తామన్నారు. మహిళ సంబంధిత ఫిర్యాదులపై పోలీసు అధికారులు వేగంగా స్పందించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్లకు వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చే పిర్యాదుదారుల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని, సహృదయ భావనతో ఫిర్యాదుదారుల సమస్యలను అడిగి తెలుసుకొని వాటిపై చట్ట పరిధిలో చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. చీరాల డిఎస్పీ పి.జగదీష్ నాయక్, సిఐ యు.శ్రీనివాసులు పాల్గొన్నారు.